



● అట్టుంటనా!

ఆడోళ్లతో పొగబెడితిరి గదప్పా!

'ఏం దప్పా ఇది. ఆడోళ్లతో గొడవ పెట్టించి మమ్మల్నిట్టా చేయడం న్యాయమా?' అంటా టీ బంకుల కాడ వాపోతుండారంట శాంతిపురం మండలంలోని రిజర్వేషన్ కేటగిరీకి చెందిన పంచాయతీ సర్పంచి, ఎంపీటీసీలు. పదవి ఇచ్చినా పవర్ లేకుండా చేసిన వైసీపీలో ఉండలేక టీడీపీలో చేరి కండువా కప్పుకున్న మరుసటి తెల్లారే మళ్లీ పచ్చ కండువాలు తీసేసి వైసీపీ కండువాలు కప్పుకున్న ఆ నాయకుల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ఇంతకీ ఏం జరిగిందబ్బా అని ఆరా తీస్తే చానా కతే నడిచిందని తెలిసింది. ఆ కతేందంటే.. కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని మురిసిపోయి ఆ నాయకులు 'హబ్బా, ఇన్నాళ్ల చెర ఇడిపోయిందిరా' అంటా నిట్టూర్పు ఇడిసిపెట్టినారు. కానీ పాపం ఆ సర్పంచికి, ఎంపీటీసీకి ఆ తర్వాతే కష్టాలు మొదులైనాయి. వైసీపీ చోటామోటా నేతల నుంచి పెద్దోళ్ల దాకా ఒకటే ఫోన్లు మోగినాయి. ఇట్టా గాదురా సామీ.. అనుకోని ఆ ఇద్దురూ ఫోన్లు స్విచ్చాఫ్ చేసి గమ్మున ఉండిపోయారు. 'ఏమప్పా, మీరు ఆఫీసులోనే ఉండిపోండి. ఇప్పుడుగాన ఇళ్లకు ఎల్లినారంటే మిమ్మల్ని ఎత్తుకోని ఎల్లిపోతారు ఆ పార్టీ నాయకులు అని, కూడా ఉండిన వాళ్లు మంచి మాట చెప్పినారు. రేత్రియాడ్నో ఒక దెగ్గిర తలదాచుకునేసి కళ్లాపి జల్లే యాళకి ఇళ్లకి చేరుకున్నారు. 'మీరు మళ్లీ వైసీపీలో చేరతారా... లేకపోతే మమ్మల్ని ఇల్లిడిసిపెట్టి పొమ్మంటారా...' అన్న స్థాయిలో ఆడోళ్లు గొడవ పెట్టుకున్నారంట. పాపం భర్తలు కదా.. ఏమీ చేస్తారు. అమ్మమ్మ అంత పనిచేయద్దే... అని బతిమాలుకునే లోగానే రయ్‌న కార్లు వచ్చి, ఎక్కించేసుకుని, కుప్పం చేరుకుని ఎమ్మెల్సీ భరత్ ముందు హాజరుపరిచారు. ఆయనేమో ఆ ఇద్దరి మెడలపై మళ్లీ వైసీపీ కండువాలు కప్పేశారు. ఈ ఫోటోలు ఉదయం 7 గంటలకల్లా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఇంతకీ రేత్రికి రేత్రి వాళ్ల ఇళ్ల దగ్గరకు చేరుకున్న అధికారపార్టీ వోళ్లు, చెప్పాల్సిందంతా చెప్పి, చేయాల్సిందంతా చేసినారంట. అసలే దబాయింపు పార్టీ అయిపాయె. ఏం జేస్తారు పాపం అన్నీ మూసుకుని కండువాలు మార్చేసుకున్నారు. - కుప్పం


మరో 22 మందిపైనా రౌడీషీట్లు!

● న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్న టీడీపీ నేతలు

పుంగనూరు, ఫిబ్రవరి 15: పుంగనూరులో మరో 22 మంది టీడీపీ శ్రేణులపై రౌడీషీట్లు తెరచినట్లు గురువారం వెలుగులోకి వచ్చింది. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి బదిలీపై వెళుతూ వీరిపై రౌడీషీట్లను తెరుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి టీడీపీని ఇబ్బంది పెట్టేలా అక్రమంగా రౌడీషీట్లు తెరవడంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. పోలీసుల వైఖరి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఉందన్నారు. గత ఏడాది ఆగస్టు నాలుగోతేది చంద్రబాబు నాయుడు పుంగనూరు మీదుగా చిత్తూరు పర్యటన సందర్భంగా గొడవలు జరిగిన సంగతి తెలిసిందే. ఈఘటనపై ఏ1గా పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిపై ఏడు కేసులు నమోదు చేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 500 మందిపై కేసులు పెట్టారు. చాలా మందిని అరెస్టు చేశారు. ఈ కేసులు విచారణ దశలోనే ఉండగా పోలీసులు వైసీపీకి మేలు చేయాలని మూడు కేసులకంటే ఎక్కువగా ఉన్నవారిపై పుంగనూరు నియోజకవర్గంలో పనిచేసే పోలీసు అధికారుల ప్రతిపాదనల మేరకు నాటి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి రౌడీషీట్లు ఉత్తర్వులిచ్చారని చల్లా బాబు ఆరోపించారు. ఇటీవల 41 మందిపై రౌడీ షీట్లు తెరవగా తాజాగా మరో 22మంది టీడీపీ శ్రేణులపై రౌడీషీట్లు తెరిచారని సమాచారం. ఈ 22 మందిలో పుంగనూరుకు చెందిన పి.సయ్యద్, ఎస్.సద్దాం, పి.రెడ్డెప్పనాయుడు, ఎస్.షామీర్, ఎస్.నూరుల్లా, ఆర్‌ఎం.సుహేల్‌బాషా, చంద్రశేఖర్, ఆర్. విరూపాక్షి, బి.శ్రీనివాసులు నాయక్.. సదుంలో జి.సుబ్బరాజు.. చౌడేపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు జి.రమేశ్‌రెడ్డి, బి.రెడ్డిప్రసాద్, పి.నాగరాజు.. సోమలలో మండల పార్టీ అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యంనాయుడు, వై.ఉమాపతి నాయుడు, కె.శ్రీనివాసులు నాయుడు, టి.రమేశ్ నాయుడు, మునిరాజనాయుడు, జయప్రకాశ్‌నాయుడు, దినేశ్‌కుమార్‌రెడ్డి, తేజేశ్‌నాయుడు, పి.రాకేశ్ ఉన్నట్లు సమాచారం.

ఈ ఎన్నికల్లో అధికారపార్టీ వలంటీర్లను నమ్ముకుంటోంది. గట్టిగా పనిచేసి మళ్లీ వైసీపీని గెలిపించాలంటూ ప్రతి సమావేశంలో ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. గౌరవ వేతనం పెంచాలన్న వలంటీర్ల డిమాండును పట్టించుకోని ప్రభుత్వం.. ఎన్నికల నేపథ్యంలో తాయిలాల వల విసురుతోంది. ఏటా జరిగే సన్మానాలను.. ఈసారి మూడు నెలల ముందే నిర్వహిస్తోంది. ఈ నగదు బహుమతినీ 50శాతం పెంచింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



వలంటీర్లకు వల

● ఈసారి మూడు నెలల ముందే సన్మానాలు
● గౌరవ వేతనం పెంచకుండా ఎన్నికల వేళ తాయిలాలు

జిల్లాలో సుమారు 10600 మంది వలంటీర్లు ఉండగా ప్రతినెలా 600-700 మంది మానేస్తూ మళ్లీ చేరుతూ ఉంటారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే వీరిని.. పార్టీ కార్యక్రమాలకూ వినియోగిస్తున్నారు. తమ గౌరవ వేతనాన్ని రూ.పదివేలకు పెంచాలన్నది వీరి ప్రధాన డిమాండు. దీనిని ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో సన్మానాల పేరిట నగదు బహుమతితో సరిపెడుతూ వచ్చింది. వలంటీర్లలో ఈ అసంతృప్తి రాజుకుంటోంది. ఈ క్రమంలో అంగన్వాడీలు సమ్మెకు పిలుపునిచ్చినప్పుడు వలంటీర్లు కూడా కొన్ని మండలాల్లో సమ్మె ప్రకటించారు. రాష్ట్ర స్థాయి నుంచి అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఎక్కడికక్కడ అధికారులు వలంటీర్ల సమ్మెను అణచివేశారు. ఇలా మన జిల్లాలోనూ వెదురుకుప్పం మండలంలో వలంటీర్లు సమ్మె నోటీసులను పంచాయతీ కార్యదర్శికి ఇచ్చిన విషయం తెలిసిందే. వీరు సమ్మెలోకి వెళ్లకుండా ప్రభుత్వం ఒత్తిడితెచ్చి అణచివేసింది. ఈ పరిణామాలు వలంటీర్లలో ఆగ్రహానికి కారణమయ్యాయి. రెండు నెలల కిందట రేషన్ సరుకుల పంపిణీ పర్యవేక్షణ బాధ్యతను వలంటీర్లకు ప్రభుత్వం అప్పగించింది. దీనికి అదనంగా రూ.750 ఇస్తామని ప్రకటించింది. కానీ, జనవరి నెలకు సంబంధించి వీరికి గౌరవ వేతనం మాత్రమే వచ్చింది. ఈ రూ.750 రాలేదు. ఎప్పుడొస్తుందో తెలియదు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోగా ఈ మొత్తం ఇస్తారా అనేదీ స్పష్టత లేదు. ఇవన్నీ వలంటీర్లను మరింత అసహనానికి గురిచేసే పరిణామాలే. వలంటీర్ల ప్రధాన డిమాండయిన గౌరవ వేతనం పెంపుదలను పక్కన పెట్టిన ప్రభుత్వం.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాయిలాల వల విసురుతోంది. ఏటా మే నెలలో నిర్వహించే సన్మానాలను.. ఆపై విడతలుగా జమయ్యే నగదు బహుమతిని.. ఈసారి ఫిబ్రవరి నెలకే తీసుకొచ్చింది. ఉన్నవారిలో 90శాతానికిపైగా వలంటీర్లకు సేవా అవార్డులతో నగదు బహుమతి అందిస్తుండగా, మిగిలినవారినీ మరోలా సంతృప్తి పరుస్తోంది. విశేష కృషిచేసిన వలంటీర్లకు మండల, మున్సిపల్ స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గస్థాయిలో రూ.20 వేలు, జిల్లాస్థాయిలో రూ.25 వేలు చొప్పున అందిస్తున్నారు. గతంలో లేని ఈ విధానాన్ని ఈసారి ఎన్నికల వేళ అమల్లోకి తెచ్చారు.

గతేడాది మే నెలలో..

గతేడాది మే నెలలో జిల్లాలోని 8408 మందిని వారం రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహించి సన్మానించారు. రూ.8.65 కోట్లను పంపిణీ చేశారు. ఈసారి ఎన్నికల నేపథ్యంలో మరింత ఎక్కువగా 8843 మందిని ఎంపికచేసి రూ.13.63 కోట్లను పంపిణీ చేయనున్నారు. ఈసారి గురువారం నుంచి 22వ తేది వరకు అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటి నిర్వహణకు మండలానికి రూ.లక్ష చొప్పున ప్రత్యేక నిధులను మంజూరు చేసింది.

వలంటీర్లకు రూ.13.63 కోట్ల నగదు పురస్కారాలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని గ్రామ, వార్డు వలంటీర్లలో 8843 మందికి రూ.13.63 కోట్ల నగదు పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించినట్లు కలెక్టర్ షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాలను ఆయా వలంటీర్ల ఖాతాలకు జమచేసినట్లు పేర్కొన్నారు. సేవావజ్ర కింద 32 మందికి రూ.14.40 లక్షలు, సేవారత్న కింద 182 మందికి రూ.54.60 లక్షలు, సేవామిత్ర కింద 8629 మందికి రూ.12.94 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరికి ప్రశంసాపత్రాలను, పతకాలను అందజేస్తారన్నారు.

'రాజధాని'కి బ్రేకులు



థియేటర్ వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 15: చిత్తూరులో గురువారం విడుదలైన 'రాజధాని ఫైల్స్' సినిమాను మధ్యలోనే ఆపేశారు. రాఘవ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న ఈ సినిమాను తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, వన్‌టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి వారి సిబ్బందితో కలిసి నిలిపివేశారు. హైకోర్టు స్టే నేపథ్యంలో చిత్ర ప్రదర్శనను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రేక్షకులకు టికెట్ డబ్బులను తిరిగి ఇచ్చేశారు. జిల్లాలోని పలు థియేటర్లలోనూ ఇదేవిధంగా మధ్యలోనే సినిమా ఆపి.. ప్రేక్షకులను బయటకు పంపించారు.

ఉద్యోగుల ఆర్థిక అణచివేత

ధోరణిని మానుకోవాలి

● ఏపీ జేఏసీ తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ రాఘవులు

చిత్తూరు, ఫిబ్రవరి 15: ఉద్యోగుల ఆర్థిక అణచివేత ధోరణిని ప్రభుత్వం మానుకోవాలని ఏపీ జిల్లా జేఏసీ కమిటీ తీర్మానించింది. చిత్తూరులోని ఎన్జీవో భవనంలో గురువారం 30 ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల దీర్ఘకాలిక ఆర్థిక బకాయిలు, ఇతరత్రా ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండు చేశారు. పే రివిజన్ కమిషన్‌లో ఐఆర్ కింద 30 శాతం ప్రకటించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. దాంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాలను ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ రాఘవులు తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీలు రమణ, నాదముని, మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్టీయూ నేత చెంగల్రాయ మందడి, ఏపీటీఎఫ్ నేత ముక్తార్ అహ్మద్, భాస్కర్, ఆర్టీసీ యూనియన్ నేత శ్రీనివాసమూర్తితో పాటు ఇతర సంఘాల నేతలు పాల్గొన్నారు.

● కాగా, ఏపీ జేఏసీ కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

పంటలపై గజరాజుల బీభత్సం



కల్లూరు, ఫిబ్రవరి 15: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ చెన్నుపాటివారిపల్లి, కమలాపురం సమీపంలో బుధవారం రాత్రి పంటపొలాలపై పడి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. చెన్నుపాటివారిపల్లికి చెందిన నరసింహులునాయుడి వరి, మిరప, అరటి పంటను ధ్వంసం చేశాయి. యర్రయ్య టమోటా పంటను, శాంబశివశెట్టి, సదాశివశెట్టికి చెందిన వరిపంటను తొక్కేశాయి. కమలాపురంలోని మునిరత్నంశెట్టి, మోహన్‌శెట్టి, వాసుదేవశెట్టికి చెందిన వరిపంటనూ ధ్వంసం చేశాయి. అచారిఇండ్లలోని జయరామాచారికి చెందిన వరిపంట, కొబ్బరి, తిరుమల ఆచారి, వీరాచారికి చెందిన వరి, అరటి పంటను ధ్వంసం చేశాయి. అరగొండకు చెందిన ఖాదర్‌బాషా, కాలేషా మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు సుమారు 20 రాతికూసాలను ధ్వంసం చేసిన అనంతరం నచ్చుకొండ ప్రాంతానికి చేరుకొని అక్కడే తిష్ట వేశాయి. సుమారు



14ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. మంగళంపేట ఎఫ్ఎస్ఓ కుప్పస్వామి మాట్లాడుతూ నచ్చుకొండ ప్రాంతంలో ఉన్న ఏనుగుల గుంపును ప్రజల సహకారంతో మద్దినాయనిపల్లి అడవివైపు తరుముతున్నామని తెలిపారు.



పేటమిట్టలో కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ


కుంభాభిషేకంలో భాగంగా కలశానికి అభిషేకం

సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు - ఆలయ ప్రాంగణం


● కమనీయంగా సీతారాముల కల్యాణం
● ముగిసిన కుంభాభిషేక మహోత్సవాలు


దేవతామూర్తుల విగ్రహాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 15: పూతలపట్టు మండలం పేటమిట్టలో గురువారం కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకాన్ని భక్తజనరంజకంగా నిర్వహించారు. దీంతో నాలుగు రోజులుగా జరుగుతున్న మహోత్సవాలు ముగిశాయి. తమ స్వగ్రామంలో ఒకే ప్రాంగణంలో విరూపాక్షమ్మ ఆలయంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి కోదండరామస్వామి ఆలయాన్ని అమరరాజా సంస్థల అధినేత డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు నిర్మించారు. ఈనెల 12న విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు మొదలయ్యాయి. నాలుగో రోజైన గురువారం ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య కోదండరామస్వామి, సీతామహాదేవి, లక్ష్మణ స్వామి, దాసాంజనేయస్వామి విగ్రహాలను వేదపండితులు ప్రతిష్ఠించారు. నేత్రబంధనం, అఖండ దీపస్థాపనం, కవాటబంధనం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 8 గంటల నుంచి గోపూజ, విశేష వాహనాలు, ప్రధాన కలశాల స్థాపన, శోభాయాత్రను జరిపి, 9.15 గంటలకు సమస్త ప్రతిష్ఠ దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతితో ఈ మహోత్సవాలు ముగిశాయి. ఉదయం 10.30 గంటలకు గల్లా జయదేవ్ దంపతులు, గల్లా రామచంద్రనాయుడు దంపతులు, గౌరినేని రమాదేవి దంపతుల చేతులమీదుగా సీతారామకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఆయా కార్యక్రమాల్లో గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, గౌరినేని ప్రసాద్, గౌరినేని రమాదేవి, గౌరినేని హర్షవర్ధన్, గౌరినేని విక్రమ్, గల్లా అశోక్, గల్లా సిద్ధార్థ, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్సీవీ నాయుడు, టీడీపీ నాయకులు టీడీ జనార్దన్, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, యువరాజులు నాయుడు, గంగారపు గోపి, దొరబాబు చౌదరి, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణమ నాయుడు, గల్లా రాజశేఖర్ నాయుడు, భానుమూర్తి నాయుడు, గల్లా రామానాయుడు, సంపత్ నాయుడు, పీఆర్వోలు బాబ్జీ, పద్మనాభ చౌదరితో పాటు గల్లా కుటుంబీకులు, చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.


పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు

● సింహం దాడితో యాత్రికుల్లో పెరుగుతున్న ఆందోళన
● గతంలో మెట్ల దారిలో చిరుత... ఇపుడు పార్కులో సింహం మ్యానీటర్లుగా మారిన వైనం



ప్రహ్లాద్ గుర్జర్‌ను చంపేశాక ఎన్‌క్లోజర్‌లోకి చేరిన సింహం

సింహం దాడిలో చనిపోయిన ప్రహ్లాద్ గుర్జర్

జూలోనూ భద్రత కరువేనా?

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుమల యాత్రికులకు నడక దారిలోనే కాదు చివరికి తిరుపతి జూపార్కులో కూడా భద్రత లేదా అన్న ప్రశ్న శ్రీవారి భక్తులోకాన్ని కలవరపరుస్తోంది. అభయారణ్యంలో చుట్టూ కంచెలు, ఆంక్షలు లేని చోట్ల చిరుతల సంచారాన్ని నియంత్రించడం అసాధ్యమని సరి పెట్టుకున్నా కట్టుదిట్టమైన ఏర్పాట్లు వుండే జూపార్కులోనూ సందర్శకులకు భద్రత లేకపోవడం అన్ని వర్గాలనూ ఆందోళనకు గురి చేస్తోంది. గురువారం మధ్యాహ్నం తిరుపతి ఎస్వీ జూపార్కులో రాజస్థాన్ సందర్శకుడు ప్రహ్లాద్ గుర్జర్ (38) నేరుగా సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడితో దుర్మరణం పాలైన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

సింహం మ్యానీటర్‌గా మారితే?

జూపార్కులోని సింహాల ఎన్‌క్లోజర్‌లో ఇప్పటి వరకూ సందర్శకులపైన, సిబ్బందిపైనా సింహాలు దాడి చేసిన ఉదంతాలు లేవు. గతంలో అభయారణ్యం నుంచీ జూపార్కులోకి ప్రవేశించిన ఓ చిరుత దాడి చేయడంతో ఉద్యోగి ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. అది మినహా చెప్పుకోదగిన ఘటనలు లేవు. తాజాఘటనలో సింహం దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో పాటు వంద నుంచీ రెండు వందల మీటర్లు లాక్కెళ్ళింది. ఆ క్రమంలో సింహం మనిషి రక్తం, మాంసాన్ని రుచి చూసింది. ఇది మ్యానీటర్‌గా మారుతుందా అన్న భయం జూపార్కు యంత్రాంగాన్ని వేధిస్తోంది. సింహం మళ్ళీ దాడులకు పాల్పడితే జూపార్కులో వైద్యులు, సిబ్బంది ప్రాణాలకు రక్షణ కల్పించడం కష్టమవుతుంది. రోజూ జూపార్కుకు సగటున 1500మంది సందర్శకులు వస్తున్నారు. వారు కొనుగోలు చేసే టికెట్లతోనూ, విరాళాలతోనూ జూ నడుస్తోంది. ఇపుడీ ఘటనతో సందర్శకుల సంఖ్య తగ్గితే మొత్తం మీద పార్కు నిర్వహణే సమస్య అవుతుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని జూపార్కు అధికార యంత్రాంగం తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకుని, సిబ్బందికి, సందర్శకులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరముంది.

సిబ్బంది లేకపోవడం కూడా...

లయన్ ఎన్‌క్లోజర్‌కు వెళ్లే మార్గంలో మొదటి గేటు పది అడుగుల ఎత్తున్నప్పటికీ సిబ్బంది కాస్త దూరంలో ఉండడంతో ప్రహ్లాద్ సులభంగానే గేటును దాటాడు. ఇనుప కంచె ఉన్న ప్రదేశంలో సిబ్బంది లేకపోయినా... గేటు ఎక్కడ ఉంటే అక్కడ ఒకరైనా సిబ్బంది ఉంటే ఇలాంటి ప్రయత్నం చేసేవారిని అడ్డుకునే అవకాశం ఉండేది.మధ్యాహ్న భోజనం సమయం అయినందున సిబ్బందిలో ముగ్గురు నలుగురు ఒకేసారి భోజనానికి వెళ్లడం కూడా ఈ పరిస్థితికి అవకాశం ఇచ్చింది. అలా అందరూ ఒకేసారి కాకుండా వంతులవారీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిఉంది.

నడక దారి చిరుత దాడులతో బెంబేలు

తిరుపతి నుంచీ తిరుమలకు కాలినడక వెళ్ళే అలిపిరి మెట్ల మార్గంలో చిరుతలు, ఎలుగుబంట్లు, కొండ చిలువలు ఎన్నో ఏళ్ళుగా భక్తులను ఆందోళనకు గురి చేస్తూనే వున్నాయి. తరచూ మెట్ల దారిలో, మధ్య మధ్యన నడక దారిలో, అడపాదడపా ఘాట్ రోడ్డులోనూ ఇవి సంచరిస్తూ వుంటాయి. అయితే చిరుతలు భక్తులపై దాడి చేసేందుకు యత్నించడం మాత్రం 2010 నుంచీ మొదలైంది. ఆ ఏడాది జూలై 27న కోకిల అనే మూడేళ్ళ వయసున్న చిన్నారిపై అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేసింది. దాడిలో చిన్నారి గాయపడగా కుటుంబీకులు, భక్తులు కేకలు పెట్టడంతో పాపను వదిలి చిరుత పరారైంది. మరో వారానికే ఆగస్టు 2న అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పెంచలపాడు గ్రామం నుంచీ గోవిందప్ప, గీతమ్మ దంపతులు కుటుంబంతో నడచి కొండకు వెళుతుండగా వారి ఎనిమిదేళ్ళ కుమార్తె కళ్యాణిపై చిరుత పులి దాడి చేసింది. మెడను కొరికి పట్టుకుని పంజాతో భుజాలపై గాయపరిచింది. అప్పుడు కూడా తల్లిదండ్రులు, బంధువులు, ఇతర భక్తులు గావుకేకలు పెట్టడంతో చిరుత చిన్నారిని విడిచి పారిపోయింది. తర్వాత పుష్కరం పాటు చిరుతలు కనిపించడం తప్ప దాడులు చేసింది లేదు. 13 ఏళ్ళ తర్వాత గతేడాది జూన్ 22న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మూడేళ్ళ కౌశిక్‌పై చిరుత పులి దాడి చేసి మెడ పట్టుకుని అడవిలోకి లాక్కెళ్ళింది. తల్లిదండ్రులు, భక్తులు, చిరువ్యాపారులు కొంతదూరం వెంబడించినా ఫలితం లేకపోయింది. అయితే రిపీటర్ స్టేషన్ సిబ్బందికి చిన్నారి ఏడుపు వినిపించడంతో వారు హుటాహుటిన అడవిలోకి వెళ్ళి ప్రాణాలతో వున్న చిన్నారిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాలుడు బయటపడడం అందరినీ అబ్బురపరిచింది. తర్వాత గతేడాదిలోనే ఆగస్టు 12న నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం నుంచీ వచ్చిన కుటుంబంలో ఆరేళ్ళ చిన్నారి లక్షిత చిరుత దాడికి బలైంది. ఈ ఘటన భక్తులతో పాటు అన్ని వర్గాలనూ తీవ్రంగా కలచివేసింది. టీటీడీ తర్వాత అటవీ శాఖ వన్యప్రాణి విభాగంతో చర్చించి పలు చర్యలు తీసుకునేందుకు యత్నించింది. అందులో ప్రధానంగా బోన్లు ఏర్పాటు చేసి నాలుగు చిరుతలను బంధించారు. కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసి వాటి కదలికలు గుర్తించి భక్తులను నడకదారిలో అప్రమత్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాలు లేవు

జూలో గురువారం ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడం లోపంగానే చెప్పాలి.కెమెరాలు వుండి వుంటే ప్రహ్లాద్ గుర్జర్ అక్కడికి ఎపుడు వచ్చాడనే విషయం తెలిసేది. కావాలని చేశాడా లేక అనుకోని విధంగా అలా జరిగిందా అనేవిషయం తెలుసుకోడానికి వీలయ్యేది. సీసీ కెమెరాల మానిటరింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా తిరుగాడేవారిని తక్షణం గుర్తించి సిబ్బందిని అప్రమత్తంచేసి దుర్ఘటనలకు ఆస్కారం లేకుండా చూసుకోగలిగేవారు.



లయన్ ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లేందుకు ప్రహ్లాద్ గుర్జర్ ఉపయోగించుకున్న వాటర్ ట్యాంకు

ఇలా అయితే ఎలా?

పకడ్బందీ ప్రహరీ గోడ, లోపల జంతువులకు విడివిడిగా ఎన్‌క్లోజర్లు, వాటికి కాపలా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ వంటి చర్యలతో పటిష్టంగా వున్నట్టు కనిపించే జూపార్కులో భద్రత ఎంత డొల్లగా ఉందో ఈ సంఘటన వెల్లడిస్తోంది.గురువారం ఘటనలో సందర్శకుడు ఉద్దేశపూర్వకంగా సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకి వుండచ్చు. అయితే మద్యం మత్తులోనో, మతి స్థిమితం లేకనో, ఆత్మహత్య చేసుకోవాలనో ఎవరైనా జూపార్కు సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకేస్తే పరిస్థితి ఏమిటి? అడ్డుకోవడానికి వీలుగా భద్రతా వ్యవస్థ ఉందా? సందర్శకులు అత్యుత్సాహంతో ఎన్‌క్లోజర్‌లోకి దిగి జంతువులకు హాని తలపెడితే బాధ్యత ఎవరిది? సెల్ఫీల పిచ్చి పరాకాష్టకు చేరిన కాలంలో ఇటువంటివి జరిగే అవకాశాలున్నాయి. వీటిని నిరోధించేందుకు తగిన నిఘా వ్యవస్థ అవసరం అని తాజా సంఘటన చెబుతోంది.

ఒక రోజు బ్రహ్మోత్సవానికి కొండ ముస్తాబు

ఆలయం వెలుపల, లోపల పుష్పాలంకరణ







గ్యాలరీల్లోకి చేరుకున్న భక్తులు

వాహనసేవల వేళలు

- ఉదయం 5.30 - 8గంటల మధ్య: సూర్యప్రభవాహనం
- 9 - 10: చిన్నశేషవాహనం, 11 - 12: గరుడ వాహనం
- మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం
- 2 - 3: చక్రస్నానం, 4 - 5: కల్పవృక్ష వాహనం
- 6 - 7: సర్వభూపాల వాహనం,
- రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం

తిరుమల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా శుక్రవారం జరగనున్న రథసప్తమి వేడుకలకు తిరుమలలో సుందరంగా ముస్తాబైంది.శ్రీవారి ఆలయంతో పాటు పలు ప్రదేశాల్లో చేసిన పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకించి విద్యుత్ కాంతుల్లో వెంకన్న క్షేత్రం దేదీప్యమానంగా మారింది. ఆలయం లోపల 4 టన్నుల, వెలుపల 3 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరణలు చేశారు. ప్రత్యేకించి 50 వేల కట్‌ఫ్లవర్స్‌తో ఆలయంలోని పలు ప్రదేశాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. వాహనమండపాన్ని ప్రత్యేకమైన పుష్పాలు, పండ్లతో అలంకరించారు. శ్రీవారి ఉత్సవమూర్తులు ఊరేగే సూర్యప్రభ వాహనంతో పాటు మరో ఆరు ప్రధాన వాహనాలను సిద్ధం చేశారు.వాహన సేవలను వీక్షించేందుకు గురువారం సాయంత్రం నుంచే భక్తులు తిరుమల ఆలయం ముందు, మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు.రద్దీ పెరిగిన నేపథ్యంలో సీఆర్వోలో గదులు పొందడానికి భక్తులు లేపాక్షి సర్కిల్ వరకు క్యూలైన్‌లో బారులు తీరారు. గదులు లభించని భక్తులు షెడ్లు, కార్యాలయాల, ఫుట్‌పాత్‌లపై సేదదీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు చలికి ఇబ్బందిపడుతున్నారు.

కారు, కర్ణాటక మద్యం స్వాధీనం

● ఒకరి అరెస్టు... పరారీలో ముగ్గురు



మద్యం, నిందితుడిని చూపిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు, ఫిబ్రవరి 15: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న ఓ నిందితుడ్ని పోలీసులు పట్టుకోగా.. మరో ముగ్గురు పరారయ్యారు. చిత్తూరు రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపిన ప్రకారం.. చిత్తూరు- పలమనేరు రోడ్డులోని బాలత్రిపుర సుందరి ఆలయం వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. చిత్తూరు వైపు వస్తున్న ఓ కారును ఆపి తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా నాట్రాంపల్లెకు చెందిన జగదీష్(33)ను పట్టుకోగా, చిత్తూరుకు చెందిన పాండ్యన్, లడ్డు, తిరుపత్తూరుకు చెందిన చంద్రు కారు దిగిపారిపోయారు. పట్టుబడిన నిందితుడి నుంచి రూ.30వేల విలువ చేసే కర్ణాటక మద్యంతో పాటు రూ.4 లక్షల కారును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

నేపాల్ అమ్మాయితో పెళ్లి



పెనుమూరు, ఫిబ్రవరి 15: నేపాల్ అమ్మాయిని పెనుమూరు అబ్బాయి వివాహం చేసుకున్నారు. పెనుమూరుకు చెందిన ముకుంద నాయుడు, ధనలక్ష్మి దంపతుల రెండో కుమారుడు భువన్‌కృష్ణ లండన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అదే కంపెనీలోనే పనిచేసే నేపాల్‌కు చెందిన జి. మనీలతో ఇతడి పరిచయం ప్రేమకు దారితీసింది. నాలుగేళ్ల వీరి ప్రేమను ఇద్దరి ఇళ్లలో చెప్పారు. దీంతో గురువారం చిత్తూరులోని ఓ హోటల్లో కుటుంబ సభ్యులు వీరికి పెళ్లి చేశారు.

సినీ ఫక్కీలో నగదు చోరీ

పుంగనూరురూరల్, ఫిబ్రవరి 15: పుంగనూరులో దుకాణం వద్ద నిలబడి ఉన్న ఓ వ్యక్తిని ఓ దుండగుడు ఏమార్చి అతడి వద్ద ఉన్న నగదు దోచుకెళ్లాడు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... మండలంలోని చంద్రమాకులపల్లెకు చెందిన రామన్న కుమారుడు వెంకటరమణ బ్యాంకులో రూ.74వేలు డ్రా చేసి బ్యాగ్‌లో పెట్టుకుని ఆర్టీసీ బస్టాండ్ క్రాస్‌లోని ఓ దుకాణం వద్ద నిలబడ్డాడు. ఓ గుర్తుతెలియని వ్యక్తి వెంకటరమణ షర్టు వెనక భాగంలో మరక ఉన్నట్లు చెప్పడంతో అతను చేతిలో ఉన్న బ్యాగ్‌ను దుకాణం వద్ద పెట్టి షర్టు తీసి పరిశీలిస్తుండగా దుండగుడు బ్యాగ్‌తో పరారీ అయ్యాడు. పక్కన ఉన్న వ్యక్తులు బ్యాగ్ తీసుకెళుతున్నట్లు వెంకటరమణను చెబుతుండగానే అప్పటికే ఆ వ్యక్తి పరుగులు తీయడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 15: ఎస్‌ఆర్‌పురం సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ శశికుమార్‌పై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన ప్రకారం.. ఎస్‌ఆర్‌పురం మండలం పాతపాళ్యం గ్రామానికి చెందిన చిన్నబ్బకు గతంలో జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ఈ నెల 12వ తేది సాయంత్రం జగనన్న ఇంటి బిల్లు విషయమై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను అడగ్గా, ఆగస్టు నెలలోనే ఎంబుక్ రికార్డు చేసి ఉన్నామని, బిల్లు త్వరలో పడుతుందని చెప్పారు. దీంతో చిన్నబ్బ ఆవేశంతో తనను దుర్భాషలాడాడని, కంప్యూటర్‌తో ప్రింట్ కూడా తీసిస్తానని చెప్పినా వినలేదన్నారు. చిన్నబ్బ తన బావమరిది, పాతపాళ్యం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిచ్చయ్యతో కలసి తనపై దాడి చేశారని వాపోయారు. ఆ రోజే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి

శాంతిపురం, ఫిబ్రవరి15: కనమలదొడ్డి-శ్యామరాజుపురం రహదారిలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి చెందింది. శ్యామరాజుపురం గ్రామానికి చెందిన మునియప్ప కుమార్తె రేణుక (6) అవ్వతాతతో కలిసి పొలం వద్దకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రేణుక తీవ్రంగా గాయపడింది. గాయపడిన బాలికను కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రేణుక మృతి చెందింది. రాళ్లబుదుగురు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్ల కిందట ఐపీ

● పెనుమూరు వ్యాపారిని పట్టుకొచ్చి నిలదీసిన బాధితులు



ప్రవీణ్‌ను ఉంచిన ఇంటి వద్ద బాధితులు

పెనుమూరు, ఫిబ్రవరి 15: పెనుమూరుకు చెందిన వస్త్ర వ్యాపారి పాండురంగయ్యశెట్టి, అతడి మనవడు ప్రవీణ్ 2021లో రూ.85 కోట్లకు ఐపీ పెట్టారు. ఆ తర్వాత కనిపించకుండా వెళ్లిన విషయం అప్పట్లో కలకలంరేపింది. బాధితులూ ఆవేదన చెందారు. ఈ క్రమంలో గురువారం ప్రవీణ్ తిరుపతిలో ఉన్న విషయం తెలిసి కొందరు బాధితులు వెళ్లి పెనుమూరుకు తీసుకొచ్చారు. అదే సమయంలో మిగతా వందలాది బాధితులూ అక్కడకు చేరుకున్నారు. ప్రవీణ్‌ను నిలదీశారు. తాను వ్యాపారంలో నష్టపోయానని, మరొకరికి డబ్బులిచ్చి మోసపోవడంతో ఐపీ పెట్టాల్సి వచ్చిందని ప్రవీణ్ చెప్పారు. బెంగళూరు, పెనుమూరులో ఉన్న ఆస్తులను అమ్మి ఇచ్చేస్తామని, తమను క్షమించాలని కోరారు.

తిరుచానూరు ఆలయం వద్ద భక్తురాలిపై దాడి

తిరుచానూరు, ఫిబ్రవరి 15: శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి దర్శనానికి విచ్చేసిన ఓ భక్తురాలిపై ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది దాడిచేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన ఓ భక్త బృందం గురువారం ఉదయం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది.ఆ సమయంలో తిరుప్పావడ సేవ జరుగుతుండడంతో ఆలయంలోకి సాధారణ భక్తులను అనుమతించలేదు. సేవ ముగిసే సమయానికి ఒక్కసారిగా భక్తులు క్యూలైన్ వద్దకు దూసుకువచ్చారు. ఆలయం గేట్ నంబరు 4 వద్ద సేలం భక్త బృందం దూసుకుని క్యూలైన్‌వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది సురేష్, వారి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన సురేష్ ఆ భక్తబృందంలోని ఓ మహిళ తలపై మ్యాన్‌ట్యాక్‌తో కొట్టడంతో ఆమెకు గాయమైంది. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. భక్త బృందానికి సర్దిచెప్పి అమ్మవారి దర్శనం చేయించి పంపారు. దీనిపై ఆలయ విజిలెన్సు అధికారి రామమోహన్‌ను అడగ్గా ఆ భక్తురాలు తోపులాటలో క్యూలైన్లో కమ్మీపై పడి గాయపడిందని చెప్పారు.అంతే కానీ తమ సిబ్బంది దాడి చేయలేదన్నారు.ఇక్కడ పనిచేసే ఆర్జితం ఇన్‌స్పెక్టర్ గతంలో మ్యాన్‌ట్యాక్‌తో ఓ కానిస్టేబుల్‌పై దాడి చేయగా కేసు నమోదై అరెస్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పుంగనూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా : మంత్రి


సోలార్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి15: పుంగనూరు మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం పట్టణ సమీపంలోని పుంగమ్మ చెరువులోని సమ్మర్‌స్టోరేజ్ వద్ద రూ.5.90కోట్లతో నిర్మించిన సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ పవర్ ప్లాంట్ వల్ల మున్సిపాలిటీకి ఏటా రూ.1.20కోట్లు ఆదా అవుతుందన్నారు. ఆ ప్రాజెక్టు ద్వారా దాదాపు 30ఏళ్ల పట్టణ అవసరాలకు సేవలు అందివ్వగలమన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని శాంతినగర్‌లో ఇళ్లపై ఉన్న 33 కేవీవిద్యుత్‌లైన్లు మార్పు చేసినట్లు తెలిపారు. అనంతరం కపాడమిట్టపల్లె వద్ద రూ.1.47కోట్లతో విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరడిగుంట, గోపిశెట్టిపల్లె గ్రామాల వద్ద నిర్మించిన రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఏపీఎస్పీడీఈఎల్ ఎస్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ శివప్రసాద్, చలపతి, ట్రాన్స్‌కో ఈఈలు శ్రీనివాసమూర్తి, మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీడీవో మునిరెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షుడిగా నయాజ్

రామకుప్పం, ఫిబ్రవరి 15: వైసీపీ ముస్లిం మైనారిటీ మండల కమిటీని ఎమ్మెల్సీ భరత్ నియమించారని మండల అధ్యక్షుడిగా నియమితుడైన నయాజ్‌అహ్మద్ గురువారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా సైఫుల్లా, ఏజాస్, ప్రధాన కార్యదర్శులుగా బాబు, షబీర్, కోశాధికారిగా అబ్దుల్, కార్యదర్శిగా జాబిర్‌లను నియమించారని ఆయన తెలిపారు. అదేవిధంగా మండల ముస్లిం మైనారిటీ యువత అధ్యక్షుడిగా అబ్దుల్‌ఘనీ, రామకుప్పం పంచాయతీ అధ్యక్షుడిగా నిజాంఅహ్మద్, పంచాయతీ యువత అధ్యక్షుడిగా అస్లాం, ముద్దనపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, సభ్యులుగా షాజాహన్, అల్లాబక్ష్, ఖాసీం సాబ్, వజీర్‌లను నియమించినట్లు ఆయన వివరించారు.

గంగమ్మ ఆలయంలో హోమాలు



సోమల, ఫిబ్రవరి 15: సోమల పంచాయతీ మునిరెడ్డిగారిపల్లెలో నూతన బోయకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం అర్చకులు ప్రత్యేక హోమాలు జరిపారు. విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించి, కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. సోమల, గన్నావారిపల్లె, రాజీవ్‌కాలనీ, దిడ్డివారిపల్లె, చెన్నయ్యగారిపల్లె, భారతంమిట్ట గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ద్రావిడలో కొనసాగిన ఉద్యోగుల నిరసన



గుడుపల్లె, ఫిబ్రవరి 15: జీతాల కోసం ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఉద్యోగ భద్రత లేకుండా చాలీచాలని జీతాలతో సంవత్సరాలుగా తమ కుటుంబాలను నెట్టుకొంటూ వస్తున్నామన్నారు. అధికారులు జీతాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు



పెద్దపంజాణి, ఫిబ్రవరి 15: కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ని పెద్దపంజాణి మండలం శ్రీరామాపురానికి చెందిన రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చానాయకులు అయూబ్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కలిసి మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాలలో మైనార్టీలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టరుతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

పెద్దపంజాణి, ఫిబ్రవరి 15: విద్యతోనే విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ఎండీహెచ్ ఫౌండేషన్ అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. గురువారం శంకర్రాయలపేట ఉన్నత పాఠశాలలో విజయం నాదే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు విద్యపై చూపాల్సిన శ్రద్ధ, ఆవశ్యకతను వివరించారు. మంచి ఉత్తీర్ణత, క్రమశిక్షణ కనబరిచిన 20 మంది విద్యార్థులకు ప్రతిభా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎండీహెచ్ ఫౌండేషన్ సిబ్బంది రోహిత్‌కుమార్, నరేంద్రకుమార్, పాఠశాల హెచ్‌ఎం వేదవతి పాల్గొన్నారు.

బోయకొండలో వనం ప్రారంభం

చౌడేపల్లె, ఫిబ్రవరి15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో అటవీశాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యం కోసం, పిల్లలకు ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డప్ప, ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి, డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే టమోటాలో అధిక దిగుబడులు

చౌడేపల్లె, ఫిబ్రవరి15: టమోటా సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పుంగనూరు నియోజకవర్గంలోని టమోటా రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ టమోటా పంటకు ఉర్లగట్టి రోగం, కాయకుళ్ళు తెగులు, సూది పురుగు తెగుళ్ళ వలన రైతులు నష్టపోతున్నారన్నారు. ఉర్లగట్టరోగం అజాక్సిస్ట్రోబిన్ ఒక గ్రాము, క్లోరోదాలోనిల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియల్ విల్ట్ సోకకుండా స్ట్రెప్టోమైసిన్ 2 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైట్ 3గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయకుళ్ళు తెగులుకు బావిస్టిన్ 1గ్రాము, టాప్సిన్ 2గ్రాములు, ఫోలియోగోల్ట్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శ్రీధర్ హార్టికల్చర్ అధికారులు సంతోషికుమారి, లక్ష్మీప్రసన్న, వరప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

చౌడేపల్లె, ఫిబ్రవరి 15: మండలంలోని చారాలలో వెలసిన అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. గురువారం రథసప్తమి వేడుకల్లో భాగంగా ఉదయాన్నే స్వామివార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి : యువకుడిపై కేసు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 15 : బైరెడ్డిపల్లెలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ బాబుపై దాడికి పాల్పడిన హరీష్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కుప్పం డిపోకు చెందిన బస్సు గురువారం పలమనేరుకు వెళుతూ బైరెడ్డిపల్లె బస్టాండ్ వద్దకు రాగానే హరీష్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై రోడ్డుకు అడ్డంగా వున్నాడు. బస్సు డ్రైవర్ హారన్‌వేసి పక్కకు వెళ్లమని చెప్పడంతో ఆగ్రహించిన హరీష్ డ్రైవర్‌పై దాడి చేశాడు. డ్రైవర్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

17న నంజంపేటలో వేలం పాటలు

సోమల : సోమల మండలం నంజంపేటలోని సోమప్పచెరువు, కృష్ణా జమ్మకుంటలో చేపల పెంపకం కోసం ఈనెల 17వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సర్పంచు వెంకటరెడ్డి ఓప్రకటనలో తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనే కాంట్రాక్టర్లు తగిన ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : నలుగురి అరెస్ట్


రాజుపల్లె చెక్‌పోస్టు, కుక్కలదొడ్డి క్రాస్ వద్ద మద్యం తరలిస్తూ పట్టుబడిన నిందితులతో పోలీసులు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 15: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా 2208 టెట్రా పాకెట్ల మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. గురువారం ఉదయం వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం తరలిస్తున్న లగేజీ ఆటోతోపాటు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని గంగవరం సీఐ కృష్ణమోహన్ పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో పెద్దపంజాణి మండలం సంపల్లెకు చెందిన సద్దాంహుస్సేన్, మంజునాథ్, జగదీష్ ఉన్నారు. సద్దాంహుస్సేన్ ఒక ముఠా ఏర్పరుచుకుని కర్ణాటక మద్యాన్ని పెద్దపంజాణి, పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, గంగవరం, పలమనేరు, బంగారుపాళ్యం మండలాలకు తరలించి విక్రయించేవాడని తెలిపారు. ఇతనిపై ఇప్పటి వరకు పెద్దపంజాణిలో 3, పుంగనూరు ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో 4 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. అక్రమ మద్యం ముఠాను పట్టుకున్న ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ చంద్రబాబు, ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ కేశవులు, సిబ్బందిని సీఐ అభినందించారు.

గంగవరం : కర్ణాటక నుంచి గంగవరం మీదుగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 10 బాక్సుల మద్యాన్ని సీజ్ చేసినట్లు గంగవరం ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఎస్ఐ తన సిబ్బందితో కుక్కలదొడ్డి క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇంతలో ఓ ద్విచక్ర వాహనంలో వెనుక తెల్లటి ప్లాస్టిక్ సంచులతో వస్తుండగా ఆపి తనిఖీ చేయగా, అందులో కర్ణాటకకు చెందిన 960 (90 ఎంఎల్) టెట్రాప్యాకెట్లు బయటపడ్డాయి. మద్యం తరలిస్తూ పట్టుబడ్డ బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లి గ్రామానికి చెందిన శరవణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

హౌసింగ్ బిల్లుల చెల్లింపు జాప్యంపై ఆగ్రహం


వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ తదితరులు

రామకుప్పం, ఫిబ్రవరి 15: మండల సర్వసభ్య సమావేశంలో పలువురు వైసీపీ ప్రజాప్రతినిధుల బంధువులు అధికార యంత్రాంగంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. హౌసింగ్ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యంపై పంద్యాలమడుగు ఎంపీటీసీ కుమారుడు, బందార్లపల్లె-2 ఎంపీటీసీ భర్త కుందనందనరెడ్డి, మణీంద్రం సర్పంచు భర్త చంద్రమోహన్‌రెడ్డిలు ఆగ్రహంతో ఊగిపోయారు. అధికారుల తీరుతో తాము గ్రామాల్లో లబ్ధిదారులకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. రామకుప్పం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బంది రోగుల పట్ల అమర్యాద వ్యవహరిస్తూ, ఇబ్బందులు పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీకి చెందిన నేత తన తండ్రిని చికిత్స కోసం తీసుకువస్తే అరగంటపాటు పట్టించుకోలేదని, దానిని ప్రశ్నిస్తే వెరెక్కడైనా చికిత్స చేయించుకోండని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడమేంటని ఆయన వారిని ప్రశ్నించారు. వైద్యసిబ్బంది తమ తీరును మార్చుకోవాలని వారు హితవు పలికారు. విజలాపురం సర్పంచు విజలాపురంబాబు మాట్లాడుతూ గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్లలో ప్రజలకు వైద్యసేవలందించాలని వైద్యసిబ్బందిని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్ళాలని ఎమ్మెల్సీ భరత్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ రాధాకృష్ణ, డీటీ దిలీప్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ కార్మికుల నిరసన


కుప్పం డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

కుప్పం, ఫిబ్రవరి 15: సమస్యల పరిష్కారంకోరుతూ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో కుప్పం డిపోలో ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారంనాడు కూడా కొనసాగింది. డిపో గేటు వద్ద నల్లబ్యాడ్జీలు ధరించిన ఆర్టీసీ, ఉద్యోగులు, కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీలో ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, 2023 సంవత్సరం రెండు డీఏలు ఇవ్వాలని, సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, అన్‌ఫిట్ అయిన డ్రైవర్లకు నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ ఉద్యోగం లేదా అడిషనల్ మానిటర్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లను చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు వేలు, డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్, నాయకులు దిలీప్‌కుమార్, ఎం.ఎస్.ఆర్.రాజా, జయశంకర్, పి.బాష, భాస్కర్, వైవీ.రమణ, జేవీ.రమణ, కేయల్.ఎస్.శెట్టి, యువరాజు, ఎస్.వెంకటేష్, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రయోజనాలు సాధించే వరకు ఆందోళనలు


ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు

పలమనేరు, ఫిబ్రవరి15 : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సాధించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని పలమనేరు తాలూకా జేఏసీ చైర్మన్ ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 14 సార్లు చర్చలకు పిలిచినా ఒక్క సమస్య కూడా సంపూర్ణంగా పరిష్కరించలేదన్నారు. ఇటీవల మంత్రులు జరిపిన చర్చల్లో కూడా మంత్రులు కొత్త వాయిదాలను కోరారే తప్ప పాత బకాయిల గురించి ప్రస్తావించలేదన్నారు. ప్రభుత్వం వద్ద దాచుకున్న డబ్బులకు కూడా గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. 12వ పీఆర్సీ కమిటీ వేసినా నేటి వరకు ఏమాత్రం ప్రగతి లేకుండా పోయిందన్నారు. తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండు చేశారు. యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి రమణ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ నెలలు గడుస్తున్నా ఫలితాలు రాలేదన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘకార్యదర్శి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ 1వ తేదీనే జమ చేయాల్సిన పెన్షన్లు నెల పొడవునా జమ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ఉత్తర్వులు సహేతుకంగా లేవని, వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మీపతియాదవ్, అశ్రీనివాసులు, రమణ, ప్రసన్న, జలంధర్, దాము, నరసింహులు, నారాయణ, అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి


పుంగనూరులో ర్యాలీ చేస్తున్న బంజార కులస్తులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి15: సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పుంగనూరు మండలంలోని బంజారా కులస్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని సుగాలిమిట్ట వద్ద సేవాగడ్ ఏర్పాటు చేసి హోమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బంజారా కులస్తులు డప్పులు వాయిస్తూ నృత్యాలు చేస్తూ బాణాసంచా పేల్చుతూ ర్యాలీగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ చేరుకుని సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బంజారా కులస్తులు ఐకమత్యంతో ముందు వెళ్లాలని, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మూడే ఈశ్వర్‌నాయక్, మూడే రెడ్డినాయక్, బాణావత్ రాజునాయక్, మనీనాయక్, శంకర్‌నాయక్, కృష్ణానాయక్, ప్రభాకర్‌నాయక్, శ్రీరాములునాయక్, గణేశ్‌నాయక్, వాసునాయక్, రమణనాయక్, నాగేనాయక్, మునీంద్రనాయక్, దేశనాయక్, మునిరామ్‌నాయక్, దొరస్వామినాయక్, మోహన్‌నాయక్, వెంకటరమణనాయక్, రెడ్డెప్పనాయక్, నాగరాజనాయక్, హీరానాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మళ్ళీ అవే పొరబాట్లు

రామకుప్పం, ఫిబ్రవరి 15: తుది ఓటరు జాబితాలో కూడా తప్పులు చోటు చేసుకున్నాయని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. గురువారం రామకుప్పం పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో మండల నేతలు, బూత్ కన్వీనర్లు, ఇన్‌చార్జిలతో కలిసి వారు ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సవరించిన ఓటరు జాబితాలో ఇంకా వందల సంఖ్యలో చనిపోయిన వారిపేర్లు, డబుల్‌ఎంట్రీలు, గ్రామాలనుంచి శాశ్వతంగా వలస వెళ్ళిన వారి పేర్లు ఉన్నాయన్నారు. వీటిపై తాము పలుసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా మార్పులు లేకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓటరు తుది జాబితాలో పొరబాట్లు లేకుండా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతలు రామమూర్తి, గంట్లప్పగౌడు, రామకృష్ణప్ప, మహ్మద్‌రఫీ, జయశంకర్, కృష్ణానాయక్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పర్యవేక్షించాలి

కల్లూరు, ఫిబ్రవరి15: బీఎల్వోలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలను పర్యవేక్షించాలని తహసీల్దార్ వసంతలత, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓపీఆర్డీ రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, 102రామిరెడ్డిగారిపల్లి, పులిచెర్ల, 106రామిరెడ్డిగారిపల్లి, గడ్డంవారిపల్లి పోలింగ్ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, దివ్యాంగుల కోసం ర్యాంపు తప్పక ఉండాలన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



గంగవరం, ఫిబ్రవరి 15 : స్థానిక సాయిబాబా ఆలయంలో స్వామివారి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. గంగవరం మండలం సాయినగర్‌లో గల సాయిబాబా ఆలయం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడతోపాటు పలమనేరు, గంగవరం పరిసరప్రాంత ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, ఫిబ్రవరి 15: ముద్దనపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్తలు నారాయణస్వామి, రామకృష్ణప్ప, జమ్మున్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

క్షయపై ఇంటింటి సర్వే

పలమనేరు, ఫిబ్రవరి15: పలమనేరులోని గాంధీనగర్‌లో గురువారం వైద్యఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్షయవ్యాధి నిర్ధారణ సర్వే కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారి నిరంజన్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

పలమనేరు,ఫిబ్రవరి15:కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేది చేస్తున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు వారు గురువారం పలమనేరులో బంద్ కరపత్రాలను విడుదల చేశారు. రైతులందరికీ సోమనాథ్ కమిటీ సిఫారసు మేరకు అన్ని పంటలకు సీటూ ప్లస్ ప్రకారం మద్దతు ధర చట్టం తేవాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం తేవాలన్నారు. ఉపాధి హామీకి కేంద్రం రూ. 2లక్షల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గిరిధరగుప్తా, ఐద్వాప్రధాన కార్యదర్శి భువనేశ్వరి, ఏఐటీయూసీ నాయకులు మద్దెల సుబ్రమణ్యం, ధనలక్ష్మి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు కూరగాయల వితరణ

పలమనేరు, ఫిబ్రవరి15 : తిరుమలలో ఈనెల 16న రథసప్తమి సందర్భంగా వచ్చే భక్తులకు వెంగమాంబ అన్న ప్రసాదం కోసం 10 టన్నుల కూరగాయలను, రెండు టన్నుల కొత్తిమీర, కరేపాకులను దాతలు వితరణగా పంపించారు. పలమనేరుకు చెందిన శ్రీవారి భక్తులు కాప్పల్లి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం హోసూరు మార్కెట్ నుంచి అక్కడి రంగనాథ బృందం వీటిని తిరుమల నుంచి వచ్చిన ప్రత్యేక వాహనంలో నింపి పంపించారు. ఈకార్యక్రమంలో పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకుల బృందం సోమశేఖర్‌నాయుడు, బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు



రామకుప్పం, ఫిబ్రవరి 15: పట్టణ శివార్లలోని వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం షష్టి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. ఇటీవల బెంగళూరుకు చెందిన అజ్ఞాత భక్తుడు వితరణగా ఇచ్చిన వెండి కవచాన్ని, వేలాయుధాన్ని స్వామి వారికి అమర్చి, విశేష పుష్పాలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, అర్చనలు చేయించారు. ఆలయ ఆవరణలోనే గల శనీశ్వరస్వామి, నాగులమ్మ, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

వీధికుక్కల పట్టివేత

పలమనేరు, ఫిబ్రవరి15 : పలమనేరులో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న వీధికుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో వీధికుక్కల సంచారం గురించి కొద్దిరోజులుగా ఆయాప్రాంత ప్రజలు స్థానిక సోషల్ మీడియాలో ఫొటోలను పెడుతున్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ గురువారం నుంచి వీధికుక్కలను పట్టించి, వాటిని తిరుపతికి పంపి వ్యాక్సిన్లు వేయడంతోపాటు, పునరుత్పత్తి కాకుండా ఆపరేషన్లు చేయించి వాటిని ఇక్కడికి తీసుకొచ్చి విడిచిపెడతామన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

కల్లూరు, ఫిబ్రవరి 15: పులిచెర్ల మండలం దేవళంపేటలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, మంత్రహోమం, సుదర్శన హోమం, గ్రామోత్సవం ప్రత్యేకాలంకరణ, చక్రస్నానం, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

'రాజధాని ఫైల్స్' నిలిపివేత

కుప్పం, ఫిబ్రవరి 15: కుప్పంలో 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనను గురువారం అధికారులు మధ్యలో నిలిపివేశారు. పట్టణంలోని ఎస్ఆర్ఎం థియేటర్‌లో గురువారం ఉదయం మార్నింగ్ షోగా రాజధాని ఫైల్స్ ప్రదర్శన మొదలు పెట్టారు. గంట సినిమా అయ్యాక, రెవెన్యూ అధికకారులు థియేటర్‌లోకి వచ్చి, సినిమా ప్రదర్శన ఆపించారు. కోర్టులో స్టే ఇచ్చినందున ప్రదర్శన జరపకూడదని ఈ సందర్భంగా వారు ఆదేశించారు.

సీఎం సభ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

శాంతిపురం, ఫిబ్రవరి 15 : శాంతిపురం మండలం మఠం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభ స్థలాన్ని గురువారం కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. ఈనెల 26న లేక 28వ తేదీలలో సీఎం పర్యటన ఉంటుందని, అందుకు సభ స్థలాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే పనులు మొదలెట్టారు.

ద్విచక్ర వాహనం చోరీ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి15: పుంగనూరు ఆసుపత్రి వద్ద ద్విచక్రవాహనం చోరీ జరిగినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప తెలిపారు. రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన వెంకటరమణ ద్విచక్రవాహనంలో పుంగనూరు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రి వద్ద వాహనం నిలిపి డాక్టర్ వద్ద పరీక్షలు చేయించుకుని బయటకు వచ్చి చూడగా ద్విచక్రవాహనం కనపడలేదని, వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భూ తగాదాలో ఒకరికి గాయాలు

పుంగనూరురూరల్,ఫిబ్రవరి15: భూ తగాదా విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా ఓ వ్యక్తి గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వెనక గల కాలనీకి చెందిన గౌస్‌ఖాన్ కుమారుడు అత్తావుల్లా, అదే ప్రాంతానికి చెందిన హైదర్‌ఖాన్ కుమారుడు సిరాజ్‌లు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సిరాజ్ గాయపడటంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వైష్ణవి దేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఫిబ్రవరి15: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారికి ఆలయ నిర్వహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

తవణంపల్లె, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని టీడీపీ పూతలపట్టు ఇన్‌ఛార్జి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని దిగువ తడకర, ఎగువ తడకర పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, కోదండయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి మధు, నాయకులు శివ, సుధాకర్ నాయుడు, గోవిందయ్య, తులసీయాదవ్, కిరణ్, మురళి, శ్రీధర్, షబ్బీర్, జయపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 15: గిరింపేట చెంగల్‌రాయకొండ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఈవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దాతల సహాయంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖ, స్థానిక కార్పొరేటర్, సచివాలయ సిబ్బంది సమక్షంలో పాత ధ్వజస్తంభం తొలగించి ఆగమశాస్త్రం ప్రకారం నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, చెంగల్‌రాయలు, పూల సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతి భావనారాయణ స్వామి కల్యాణం



స్వామి వారిని దర్శించుకుంటున్న భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 15: నగరి మండలంలోని మాంగాడులోని భద్రావతి భావనారాయణస్వామి ఆలయంలో గురువారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన స్వామి వారికి తన మొక్కులు తీర్చుకున్నారు.

21న మాతృభాష దినోత్సవం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 15: చిత్తూరు హరివిల్లు లలితకళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న సంతపేట నాగాలమ్మ ఆలయం బృందావన్ పాఠశాలలో ప్రపంచ మాతృభాష దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి బి.మునస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శైలజాకుమారి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో గొల్లాపిన్ని సుబ్రమణ్యంశర్మ, వి. హరి నాయుడు, టింగోవిందన్, బి. భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగరంలోని కళాకారులు, సాహితీవేత్తలు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెనుమూరు, ఫిబ్రవరి 15: పెనుమూరులో శనివారం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ప్రతి నెల మూడవ శనివారం చెన్నై శంకరనేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరానికి ప్రజలు ఆధార్ కార్డు తీసుకువచ్చి వైద్య సేవలు పొందవచ్చని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE PRINICIPAL SENIOR CIVIL JUDGE, CHITTOOR
S.O.P.No. 3 of 2024

Between
1.K.Gowri, W/o M.Saravana, D/o Late N.Kanniappan,D.No. 12-330, Kariyappa Street,Chittoor
2.K.Gajendran, S/o Late N.Kanniappan, D.No.5-3/2, Krishnaswamy Street, No.75 Doddipalli,Chittoor ....Petitioners
And
NIL ....Respondents

GENERAL NOTICE

The petitioners who are the daughter and son of deceased N.Kanniappan filed the above OP for issuance of Succession Certificate in their favour to receive the amount lying in State Bank of India, Chittoor Main Branch. The mother of Petitoners and wife of deceased N.Kanniappa Smt N.Renuka@ Renukamma also died. Hence the above petitioners are only legal heirs to receive the said amout. The above OP is posted for filing objections. **on 11-03-2024 at 10.30 A.M.** If anybody having objection they may appear before said court on said date and file their objections. Otherwise the matter will be decided according to law.

SCHEDULE

State Bank of India,Main Branch, Chittoor the amount lying in S.B.A/c No10859958701 stands in the name of N.Kanniappan,S/o Natesa Modali for sum of Rs.1,27,000/-

Sd/-**D.KANNAIAH REDDY**
Advocate for the petitioners

కార్మికశాఖ నిర్లక్ష్యం వీడాలి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 15: తమకు న్యాయబద్ధంగా రావాల్సిన జీతం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డెయిరీ కార్మికులు కలెక్టరేట్ వద్ద కొనసాగిస్తున్న ధర్నా గురువారానికి 156వ రోజుకు చేరింది. తమకు రావాల్సిన రూ.60 కోట్ల బకాయిలు చెల్లించే విధంగా చూడాలని కార్మిక శాఖకు లేఖరాస్తే, డెయిరీ యాజమాన్యాన్నే అడగాలని బదులు ఇవ్వడం సరికాదని కార్మికుడు పీడీ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రక్షణ కల్పించాల్సిన కార్మికశాఖ అధికారులు తమకేమి పట్టదన్నట్లు వ్యవహరించడం సరికాదని చెప్పారు. ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టి తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ నిరసనలో పలువురు డెయిరీ కార్మికులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

చిత్తూరు, ఫిబ్రవరి 15: పేకాట స్థావరంపై రెండో పట్టణ పోలీసులు దాడి చేసినట్లు సీఐ ఉలసయ్య తెలిపారు. గురువారం నగరంలోని సంతపేట సమీపంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాంతో సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన డీడీ



హాస్టల్ విద్యార్థులతో డీడీ రాజ్యలక్ష్మి

పూతలపట్టు, ఫిబ్రవరి 15: పూతలపట్టు మండలం పి.కొత్తకోటలో వున్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను గురువారం సాయంత్రం ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వార్డెన్‌ను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో ఆమె హాస్టల్‌ను తనిఖీచేసి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో షకీలా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 15: గంగాధరనెల్లూరు మండలం అక్కనగారిపల్లె వైపు గల చెరువుకట్ట వద్ద తారు రోడ్డు నిర్మాణపనులకు డిప్యూటీ సీఎం పీఏ ఆనందరెడ్డి, పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ గుణారెడ్డి, కాంట్రాక్టర్ రూప్‌కుమార్‌రెడ్డిలు గురువారం భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, జైన్ ఎంప్లాయిస్ వైఎస్సార్ యూనియన్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు పాల్గొన్నారు.

పార్కును ప్రారంభించిన మంత్రి రోజా

నగరి, ఫిబ్రవరి 15: నగరి పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ తుడా పార్కును గురువారం మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్లు దయానిధి, ఇంద్రయ్య, మునికృష్ణారెడ్డి, వెంకటరత్నం, బిలాల్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

నిండ్ర, ఫిబ్రవరి 15: మండల కేంద్రమైన నిండ్రలో వైసీపీ ఆసరా నాల్గవ విడత మెగా చెక్కును గురువారం మంత్రి రోజా మహిళలకు పంపిణీ చేశారు. 280 మంది పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో భవాని, ఎంపీపీ దీప, ఏపీఎం చంద్రకళ, మహిళా సంఘం అధ్యక్షురాలు శశికళ, నాయకులు శ్యాంలాల్, బాబురెడ్డి, మేరీ శివలింగం ఆచారి, సుబ్రమణ్యం యాదవ్, అనిల్, విజేష్ తదితరులు పాల్గొన్నారు.

17న జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 15: చిత్తూరు మెసానికల్ మైదానంలో ఈ నెల 17వ తేదీన ఖోఖో సీనియర్ స్త్రీ, పురుష జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శరత్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో ఎంపికైన వారు ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 8639389796, 7989166074 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 15: చిత్తూరు పాతబస్టాండులో గురువారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వైసీపీ కార్యాలయంలో మొదలియార్ కుల సంఘనేతలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కబ్జా అవుతున్న భూములను కాపాడండి

గుడిపాల, ఫిబ్రవరి 15: మండలంలోని మారుమూల ప్రాంతాలైన నారగల్లు, చీలాపల్లి, చిత్తపార తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను ఏళ్ల తరబడి కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నారగల్లు రెవెన్యూ గ్రామంలో రికార్డుపరంగా పక్కాగా ఉన్నా, వారి భూములను ప్రభుత్వ అధికారులే తొలగించడమే కాకుండా ధ్వంసం చేస్తున్నారే తప్ప, అక్రమంగా బినామీల పేర్లతో దర్జాగా భూములు అనుభవిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద వున్న అన్నక్యాంటీన్‌లో గురువారం తగ్గువారిపల్లె గ్రామానికి చెందిన జాకీర్ హుస్సేన్ కుమారుడు సయ్యద్ జతిన్ జన్మదినాన్ని పురస్కరించుకుని భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, శ్రీనివాసులు, హరిప్రసాద్, గిరిబాబు, రాజేంద్ర నాయుడు, రవి, కవి తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 15: మాఘమాసం తొలి సప్తమి సందర్భంగా శుక్రవారం నగరవాసులు రథసప్తమి పండుగను జరుపుకోనున్నారు. స్థానిక మహాలక్ష్మి, గోదాదేవి, ఆంజనేయ సమేత వెంకటేశ్వరస్వామి, వరదరాజస్వామి, శ్రీరంగనాథ స్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో...

కార్వేటినగరం: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు వేణుగోపాలస్వామిని పురవీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కోర్టు ఆదేశాలిచ్చినా పట్టించుకోరా..?: టీడీపీ

గుడిపాల, ఫిబ్రవరి 15: ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను వినియోగించకూడదని కోర్టు ఆదేశాలిచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని వాడుకోవడం దారుణమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారబలంతో ఏమి చేసినా చెల్లిపోతుందని అనుకుంటే త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎన్ని ట్రిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- టీడీపీ నేతలు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 15: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నేతలు అన్నారు. గురువారం నగరంలోని 48, 49వ డివిజన్ సంతపేటలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ చంద్రబాబు తన రాజకీయ అనుభవంతో రాష్ట్రానికి ఎన్నో పెట్టుబడులు తెచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని చెప్పారు. మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలిచ్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం టీడీపీ హయాంలోనే జరిగిందని, వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్న గుంతను కూడా పూడ్చలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయడం ఎంతైనా అవసరమని, ప్రజలు రెండు పార్టీల పాలనను గమనించి టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. నేతలు కటారి హేమలత, గురజాల జగన్మోహన్, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, త్యాగరాజన్, రతీదేవి ఈశ్వర్, కంద, రాజశేఖర్, వరలక్ష్మి, జాఫర్, కోడి బాబు, దిలీప్ కుమార్, సూరి, మురళి, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలలో కల్తీ చేస్తే చర్యలు తప్పవు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 15: జిల్లాలోని పాల డెయిరీ నిర్వహకులు పాలలో కల్తీ మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన పాల డెయిరీ నిర్వాహకులకు పాల వినియోగ చట్టం 2023పై అవగాహన కల్పించారు. పాల సేకరణలో దళారీల వ్యవస్థను రూపుమాపాలని హెచ్చరించారు. పాడి రైతులు నేరుగా విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. రోజువారి పాల వ్యాపారులు, డెయిరీ నిర్వాహకులు కల్తీలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

నేడు జయహో బీసీ సమావేశం

పాలసముద్రం, ఫిబ్రవరి 15: మండలంలోని క్రిష్ణజిమ్మాపురంలోని ధర్మరాజులు గుడి ఎదుట జయహో బీసీ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రవి యాదవ్‌లు పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్వామీ.. నోరు అదుపులో పెట్టుకో

- జయహో బీసీ సమావేశంలో డాక్టర్ థామస్



మాట్లాడుతున్న డాక్టర్ థామస్

కార్వేటినగరం, ఫిబ్రవరి 15: డిప్యూటీ సీఎం నారాయణస్వామి నోరు అదుపులో పెట్టుకోకపోతే, ఆయన అవినీతి చిట్టాలను విప్పుతానని జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ హెచ్చరించారు. గురువారం డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్వేటినగరం టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, హిందూ ముస్లిం కల్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. థామస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీల అభివృద్ధిని అణగదొక్కిందని విమర్శించారు. టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం తన గురించి మత ప్రస్తావన చేస్తూ, క్రిస్టియన్ అంటూ చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాదేనని థామస్ చెప్పారు. అనంతరం మెగా డీఎస్సీ పేరుతో మినీ డీఎస్సీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని జీడీ నెల్లూరు నిరుద్యోగ జేఏసీ నేతలు డాక్టర్ థామస్‌కు వినతిపత్రం అందచేశారు. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులే తగిన గుణపాఠం చెబుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నేతలు వెంకటేష్, షణ్ముగ రెడ్డి, శ్రీధర్ యాదవ్, రవిప్రకాష్, రవియాదవ్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రాజు, కొండూరు త్యాగరాజు, జగన్నాథం, నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

అజాతశత్రువు కుతూహలమ్మ

- ప్రథమ వర్ధంతి సందర్భంగా పలు పార్టీల నేతల నివాళి



కుతూహలమ్మ సమాధివద్ద నివాళులు అర్పిస్తున్న తనయుడు హరికృష్ణ, నేతలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 15: రాజకీయరంగంలో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ పార్టీలకు అతీతంగా అజాతశత్రువుగా రాణించారని పలు పార్టీల నేతలు పేర్కొన్నారు. మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ వి.లక్ష్మిరెడ్డిపల్లె దళితవాడకు సమీపంలో గురువారం ఆమె సమాధివద్ద కుటుంబసభ్యులు పూజలు చేయగా, టీడీపీ, వైసీపీకి చెందిన పలువురు నేతలు పూలుచల్లి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కుతూహలమ్మ జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పదవులను అలంకరించి, ప్రజా నాయకురాలిగా పేరుగడించారని కొనియాడారు. ఈకార్యక్రమంలో కుతూహలమ్మ భర్త, మాజీ ఎంపీపీ డాక్టర్ మునిసిద్ధయ్య, తనయుడు, నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఆనగంటి హరికృష్ణ, కోడలు డాక్టర్ భానుమతి, జడ్పీ మాజీ సీఈవో వెంకటస్వామి, నేతలు వేల్కూరు బాబురెడ్డి, ఎన్.బి. సుధాకర్‌రెడ్డి, షణ్ముగవర్మ, దేవరాజులు, రాంబాబురెడ్డి, మునిచంద్రారెడ్డి, పూల రఘునాథరెడ్డి, కంద్రా మునికృష్ణమ నాయుడు, నాగరాజులురెడ్డి, తులసిరెడ్డి, లోకేష్‌రెడ్డి, బాబురెడ్డి, మునిరత్నంరెడ్డి, దండాలు గోవిందయ్య పాల్గొన్నారు.

పాదరక్షలకు అధిక ధరల వసూలుపై ఫిర్యాదు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో పాదరక్షలు భద్రపరిచే దుకాణానికి హక్కు పొందిన టెండరు దారుడు భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ఆలయ ఉభయదారుడు రాజ్‌కుమార్ గురువారం ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిబంధనలకు విరుద్ధంగా టెండరు దారుడు భక్తులను మోసగించి అధిక ధరలు వసూలు చేసుకుంటున్నాడని తెలిపారు. దీంతో పాటు అతడు పాద రక్షలు విడిచే చోట అక్రమంగా సోడా కొట్టు నిర్వహిస్తున్నాడన్నారు. ఈ విషయంపై ఆలయ అధికారులకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. భక్తులను మోసగిస్తున్నారని తెలిసినా అధికారులు పట్టించుకోక పోవడం చాలా దారుణమని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాద రక్షల టెండరు దారుడిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.


ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని వైసీపీ నేత కబ్జాచేశాడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అయ్యప్పగారిపల్లె గ్రామస్థులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 15: ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని వైసీపీ నేత కబ్జాచేశాడని పూతలపట్టు మండలం, అయ్యప్పగారిపల్లె దళితులు ఆరోపించారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన 28 మంది దళితులకు 1987లో ప్రభుత్వం ఒక్కొక్కరికి 3 సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చిందని చెప్పారు. తమవద్ద డబ్బులు లేక ఇంతవరకు ఇల్లు నిర్మించుకోలేదని తెలిపారు. కాగా జగనన్న కాలనీ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుండటంతో లోన్ తీసుకుని ఇల్లు నిర్మించుకుందామని అనుకున్నామని చెప్పారు. అయితే వైసీపీ నేత తమ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. మా భూములను మాకు ఇవ్వాలని అడిగినందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నాడని అన్నారు. ఈ విషయంపై రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

గ్లోబల్ లాజిక్స్‌లో ఉద్యోగాలకు విజయం విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విజయం విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 15: ప్రముఖ బహుళ జాతి సంస్థ గ్లోబల్ లాజిక్ వారు స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ కళాశాలకు చెందిన 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ఈ ఎంపికలో ఆన్‌లైన్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్, ఆపరేషన్స్ ప్రక్రియల ద్వారా నిర్వహించిన ఎంపికలో వార్షిక వేతనం రూ.2.20 లక్షలకు గాను తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

రైటింగ్ ప్యాడ్ల పంపిణీ

యాదమరి, ఫిబ్రవరి 15: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయనున్న వంద మంది విద్యార్థులకు పీఆర్‌టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకచ్చారి, జిల్లా మహిళా అధ్యక్షులు హిమబిందు కలిసి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లను అందించారు. గత మూడు సంవత్సరాలుగా గొల్లపల్లె పాఠశాలకు, 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థుల పేరిట యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రైటింగ్‌ప్యాడ్లు, ఇతర ప్రోత్సాహక బహుమతును అందిస్తున్నట్లు హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సి. నరసింహారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, మురళీధర్, అరుణ, ఉష, విజయ్‌కుమార్, సుల్తాన్, సబిత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న దాతలు

సక్రమంగా అందని పశువైద్యం

- ఆందోళనలో పాడి రైతులు

పాలసముద్రం, ఫిబ్రవరి 15: మండలంలోని పశువైద్యులు పశువులకు సక్రమంగా వైద్యసేవలు అందించడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. మండల కేంద్రమైన పాలసముద్రంలో పశువైద్యశాల ఉంది. వనదుర్గాపురం, క్రిష్ణజిమ్మాపురం పంచాయతీల్లో గోపాలమిత్రలు పశువైద్యం అందిస్తున్నారు. పాలసముద్రం పశువైద్యశాలలో పశువైద్యాధికారి సరిగ్గా అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్ జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఉంటూ సక్రమంగా విధులకు రావడంలేదని పాడి రైతులు వాపోతున్నారు. గురువారం వనదుర్గాపురం గ్రామానికి చెందిన జయరామశెట్టికి చెందిన లేగదూడ మరణించింది. గోపాలమిత్ర దానికి వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాలలో పాడిపశువులకు సక్రమంగా వైద్యం అందించేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీని అరికట్టండి



పాతార్యాడులో లీకేజీ అవుతున్న పైప్‌లైన్

విజయపురం, ఫిబ్రవరి 15: మండలంలోని పాతార్యాడులో పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. రోజుల తరబడి పైప్‌లైన్ లీకేజీ కావడంతో ఓవర్‌హెడ్ ట్యాంకు చుట్టూ నీరు నిలవడంతో మురుగుగా మారుతోందని, దీని వలన దోమలు పెరగడంతో పాటు మురుగునీరు పైప్‌లైన్‌లో కలిసే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇకపై పెన్షనర్లకు చిత్తూరులోనే వైద్యసేవలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 15: విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఇకపై చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అపోలో యాజమాన్యం వైద్యసేవలు అందించనున్నట్లు జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్. కేశవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు పొరుగు ప్రాంతాలైన వేలూరు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి వైద్యం కోసం అవస్థలు పడటంతో పాటు వాటి బిల్లులు రీయింబర్స్‌మెంట్ చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని, అయితే జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్ చొరవతో డీఆర్‌డీఏ పీడీ అపోలో యాజమాన్యంతో చర్చించారని తెలిపారు. దీంతో రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజన్స్‌కు అపోలో ఆస్పత్రి యాజమాన్యం ఒక పింక్ కార్డు మంజూరు చేసి పింఛన్ కార్డు ద్వారా, ఈసీహెచ్ కార్డుల ద్వారా వైద్య సేవలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకై 9866857089 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి: డీఈవో

యాదమరి, ఫిబ్రవరి 15: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు సూచించారు. గురువారం మండలంలోని వరిగపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విజయ స్ఫూర్తి పరీక్షల్లో విద్యార్థులు ఫలితాలు ఏ విధంగా సాధించారని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన సబ్జెక్టుల్లో తర్ఫీదునివ్వాలన్నారు. రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం రమాబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గుడిపాల, ఫిబ్రవరి 15: అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో అర్హులైన వారికి ఇంటి స్థలం ఇంతవరకు కేటాయించలేదని, పేదలకు రేషన్ కార్డులు ఇవ్వడం కూడా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే వారికి ఇంటి స్థలం మంజూరుచేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.